క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



గాలివీడు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జవహర్‌బాబు

గాలివీడు : మండల కేంద్రంలోని గాలివీడు-1 సచివాలయాన్ని ఎంపీడీఓ జవహర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని, సచివాలయానికి వచ్చే ప్రజలతో మమేకమై వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మండలంలోని ప్రతి సచివాయాన్ని తరుచూ తనిఖీ చేస్తానని చెప్పారు.

ఏఓగా లక్ష్మిదేవి బాధ్యతలు



సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా బుధవారం పెనుగొండ లక్ష్మిదేవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న నాగభూషణం బదిలీపై జెడ్పీ క్యారాలయంకు వెళ్లారు. ఆయన స్థానంలో మైదుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా, ఎఫ్ఎస్సీ ఎంపీడీఓగా పనిచేసిన లక్ష్మిదేవి సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా బదిలీ కావడంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

రికార్డుల పరిశీలన



అభివృద్ధి కార్యక్రమాలపై ఆరాతీస్తున్న డీఎల్‌డీఓ నరసింహమూర్తి

వీరబల్లి : మండలంలో వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను బుధవారం రాజంపేట డీఎల్‌డీఓ నరసింహమూర్తి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో పంచాయతీ నిధులపై చర్చించారు. తదుపరి డీఎల్‌డీఓ పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభం

సిద్దవటం : శారీరక దృఢత్వానికి వ్యాయామం ఎంతో అవసరమని వైఎస్‌ఆర్‌సీపీ సిద్దవటం మండల యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారిలోని శ్రీ వాసవీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఆర్‌ఎస్ జిమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు క్రిష్ణచైతన్య, కె.వి.సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

కురబలకోట : ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. బుధవారం రిజర్వాయర్‌ను సందర్శించి భూ నిర్వాసితులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయన్నారు. 780 ఎకరాల భూములకు రూ. 108 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 25 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉద్యాన పంటలే ఆధారం.. ఆదాయం

- ఎరువుల యాజమాన్యంతో మంచి దిగుబడి
- పంటసాగులో ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరి



మండలంలో సాగులో ఉన్న అరటి పంట



బొప్పాయిని సాగు చేస్తున్న రైతు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రతి ఏడాది ఉద్యాన పంటలే ఇక్కడి రైతులకు ఆధారం. ముఖ్యంగా అరటి, బొప్పాయి పంటల సాగుతో ఏడాది పొడవునా వ్యవసాయం చేస్తూ రైతులు జీవనం సాగిస్తుంటారు. అరటి, బొప్పాయి పంటలలో ఓ మోస్తారు దిగుబడి వచ్చినా రైతులకు పెట్టుబడి వస్తుండడంతో ఏడాది పొడవునా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలోనే వేల ఎకరాలలో బొప్పాయి, అరటిని సాగు చేస్తున్నారంటేనే పరిస్థితి అవగతం చేసుకోవచ్చు. గత మూడు సంవత్సరాలుగా అరటి, బొప్పాయి పంటలలో వాతావరణం మార్పులు, ధరల తగ్గుదల రైతుల నష్టం వచ్చినప్పటికీ తిరిగి వ్యవసాయం చేయడానికి ఎంతో కొంత డబ్బులు చేతికి వస్తుండడంతో ఉద్యాన పంటలే ఆదాయ వనరులుగా భావిస్తున్నారు. దీనికి తోడు నియోజకవర్గంలో ఎప్పుడు నెలకొనే వాతావరణం ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉంటుంది. చుట్టూ కొండలు ఉండటంతో చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు మైదాన ప్రాంతాలకు చేరుతుండటంతో నీటి సమస్య లేకుండటం ఇక్కడి రైతులకు ఉద్యాన పంటల సాగు చేయడానికి దోహదం చేస్తోంది.

అరటిలో టిష్యూ కల్చర్, బొప్పాయిలో తైవాన్ రకాలు

అరటిలో టిష్యూ కల్చర్, బొప్పాయిలో తైవాన్ మొలకలు సాగుచేయడానికి రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఈ మొలకలు వైరస్‌లకు తట్టుకొని దిగుబడి బాగా ఇస్తాయి. ధరలు నిలకడగా ఉంటాయి. కోడూరులో టిష్యూ కల్చర్ అరటి, బొప్పాయి పిలకల నర్సరీలు ఉన్నాయి. ఇక్కడి వారే కాకుండా మిగతా ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడ నర్సరీల నుంచి మొలకల తీసుకుని వెళ్తుంటారు. సంవత్సరం మొత్తం ఇక్కడి నర్సరీలలో తయారయ్యే వాటికి నాటుకోవడానికి అనుకూలిస్తుండటంతో రైతులు కోడూరు వచ్చి మొక్కలను తీసుకెళుతుంటారు.

భూసారాన్ని పరీక్షించాకే..

అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు వ్యవసాయంలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రెండు పంటల ప్రారంభ దశలోనే రైతులు ఎరువుల వాడకం గురించి రైతులు తెలుసుకోవాలి. భూసారాన్ని బట్టి రసాయనిక ఎరువులను మోతాదు నిర్ణయించే మట్టి నమూనాలు అనుసరించి నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్ ఎరువులు సమతూకంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నత్రజని ఉపయోగాలు..

నత్రజని కాంప్లెక్స్ ఎరువుల, యూరియా రూపంలో వాడొచ్చు. నత్రజని పంట ఎదుగుదలకు, పచ్చదనానికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. దీన్ని మూడు భాగాలుగా విభజించి వాడాలి. నాటే దశ నుంచి అధికారుల సూచన మేరకు వాడాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి, 250 కిలోల తేమ ఉన్న మట్టిలో కలిపి రెండు రోజుల పాటు నిల్వ ఉంచి వాడితే మంచిది.

భాస్వరం వల్ల..

భాస్వరం వాడడం వల్ల మొక్కల వేర్లు దృఢంగా అయ్యేందుకు ఉపయోగపడుతుంది. అందువల్ల దీనిని సాగుకు ముందు మట్టిలో వేయాలి. లేదా నాటిన 10 రోజులలోపు చల్లాలి. దీనివల్ల మొక్కకు ఉండే వేర్లు బలంగా అయ్యేందుకు పోషకాలు అంది మంచి దిగుబడి వస్తుంది.

పొటాష్ వాడకం వల్ల..

పొటాష్ వాడకం వల్ల ఆకులు బలంగా వస్తాయి. దీనివల్ల పైరుకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. బొక్కలో పిండి పదార్థం తయారీకి ఎంతగానో ఉపయోగపడుతుంది. పిలకలు వేసే దశలో పొటాష్ రెండు భాగాలుగా వాడాలి.

నియోజకవర్గంలో అరటి, బొప్పాయి పంట ఎకరాలలో..		
మండలం	అరటి	బొప్పాయి
కోడూరు	2420	13000
ఓబులవారిపల్లి	1830	2462
పుల్లంపేట	2200	650
చిట్వేలి	838	1890
పెనగలూరు	295	315

జింక్ ఉపయోగాలు..

జింక్ సల్ఫేట్ దుక్కి దశలో ఎకరాకు 20 కిలోలు వేయాలి. తరువాత జింక్ లోపం కన్పిస్తే రెండు గ్రాములు జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచిది. అధిక ఎరువుల వాడకంతో పంటకు నష్టం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభదాయకం



వ్యవసాయం చేసే రైతులు పంట సాగులో తప్పనిసరిగా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిది. దీని వల్ల పంటనష్టం జరగకుండా అధిక దిగుబడులు వస్తాయి. రైతులకు ఎరువుల వాడకంలో సలహాలు ఇస్తూ వారికి అవగాహన కల్పిస్తాం. రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి పెంచుకోవాలి. సాగు చేసే ముందు మట్టి నమూనాలను తీసుకువచ్చి వ్యవసాయ అధికారులతో పరీక్షలు చేయించుకోవాలి.

- వెంకట భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, కోడూరు

ప్రతి ఏడాది అరటి సాగు



గత 10 సంవత్సరాలుగా ప్రతి ఏడాది బొప్పాయి, అరటి పంటను పండిస్తున్నాను. ప్రస్తుతం నేను 5 ఎకరాలలో బొప్పాయి, 5 ఎకరాలలో పంటను సాగుచేస్తున్నాను. ఈ ఏడాది ధరలు బాగా ఉంటాయని ఆశతో సాగు చేస్తున్నాను. దళారుల బెడద తీరితే రైతుకు లాభాలు వస్తాయి. అలానే అధికారులు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

- ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ రైతు, కొత్తపల్లి, రైల్వేకోడూరు

వంట సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వీరబల్లి : మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక వంట మాస్టర్, మూడు అసిస్టెంట్ కుక్ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు మండల విద్యావనరుల కేంద్రంలో అందజేయాలన్నారు. వీటిలో మొదటి ప్రాధాన్యతగా ఎస్టీ, రెండో ప్రాధాన్యత ఎస్సీ, మూడవ ప్రాధాన్యత బీసీ, నాల్గవ ప్రాధాన్యత ఓసీ మహిళలకు ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

పెనగలూరు : పెనగలూరు మండల సర్వసభ్య సమావేశం నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. ఈ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సమావేశంలో పాల్గొనున్నట్లు తెలియజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో ఉచిత వృత్తి శిక్షణ

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత వృత్తి శిక్షణ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ కాలేజ్ భారత్ ఎడ్యుకేషన్ సొసైటీ రాజంపేట ఇన్‌చార్జ్ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎడ్యుకేషన్ సొసైటీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. వివరాలకు 8919238902, 8074510187, 9381856271 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ఓబులవారిపల్లె: బొప్పాయి రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ మల్లిక



సిద్దవటం: వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని మండల వ్యవసాయ అధికారిణి మల్లిక పేర్కొన్నారు. బుధవారం గాదెల వెంకటాపరం, చెంచువారిపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మక్కువ పెంచుకోవాలని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పశువైద్యాధికారి మణికంఠ మాట్లాడుతూ పశువులకు టీకాలు ఇప్పించాలని, పశుకిసాన్ కార్డు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల తమ పొలాలలో చీడపీడల నివారణకు ఎంతో దోహదపడుతుందని బుధవారం ఏఓ సుధాకర్ తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని అనంతరాజుపేట, రాఘవరాజపురం గ్రామాలలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించి, తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు, జ్యోతి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం ఏఓ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. తదుపరి గ్రామ సభను నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరిలో సస్యరక్షణ చర్యలు సకాలంలో తీసుకోవాలని రైతులు తెలిపామన్నారు. రెండు గ్రామాల్లో సాగైన వరి పంటను పాము పొడ తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు షీత్‌మార్ లేదా కాసుగామైసిన్ 2.5 మిల్లీ లీటర్ల మందును నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అక్కడక్కడ కాండం తొలుచు పురుగు ఆశించిందని నివారణకు ఫ్లబెండమైడ్ 50 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



రెవెన్యూ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రామాపురం : మండలంలోని నిరుపేదలందరికీ నివాస స్థలాలు మంజూరు చేయాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కేంద్రం మర్రి సుమిత్ర ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికి ఇంటి స్థలాలు లేని నిరుపేద, దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఎంతో మంది కటిక పేదరికంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, బంజర మాన్యాలను అధికారులు కాపాడాలన్నారు. మండలంలోని సూర్యనారాయణపురం సమీపంలో కబ్జా గురైన ప్రభుత్వ భూములపై విచారణ జరిపించి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు మూడు ఎకరాలు పంపిణీ చేయాలని, ప్రతి అర్హుడికి ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇళ్లని నిర్మించాలన్నారు. అనంతరం ఈ మేరకు తహసీల్దార్ రామాంజనేయులకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు సురేంద్ర, మహిళా సమాఖ్య మండల నాయకులు సుబ్బమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్‌కు తాత్కలిక మరమ్మతులు

ఒంటిమిట్ట : గత నెల 27వ తేదీ మండల పరిధిలోని కుడమలూరు అటవీ ప్రాంతంలో శ్రీరామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైన్ పగిలిపోవడంతో అప్పటి నుండి ఒంటిమిట్ట చెరువుకు అందాల్సిన సోమశిల వెనుకజలాలు మొన్నటి వరకు అందలేదు. చివరకు ఇరిగేషన్ అధికారులు పగిలిపోయిన పైపులైన్‌కు మరమ్మతులు చేసి బుధవారం ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా సోమశిల వెనుకజలాలను తిరిగి వదిలారు. సోమశిల వెనుక జలాలను ఒంటిమిట్ట చెరువుకు వదిలిన ప్రతిసారి పైపులైన్ పగిలిపోవడంతో నిత్యం సమస్యగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం కోసం ఇరిగేషన్ అధికారులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్టిమేషన్ వేసి పంపారు. అందుకు సంబంధించి ఉన్నతాధికారులు నుండి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ప్రస్తుతానికి పైపులు పగిలిపోతున్న వాటిని ఎలాగోలా మరమ్మతులు చేసి ఒంటిమిట్ట చెరువుకు ఇరిగేషన్ అధికారులు సోమశిల వెనుక జలాలను శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా పంప్ చేస్తున్నారు.

పారిశ్రామికవేత్త పోలి నరసయ్య మృతి



రాజంపేట టౌన్ : నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన ప్రముఖ పారిశ్రామికవేత్త పోలి నరసయ్య (90) బుధవారం మృతి చెందాడు. పారిశ్రామికవేత్తగానే కాక వివిధ సేవా కార్యక్రమాలు, ఆలయాల నిర్మాణానికి హితోధికంగా సహాయ, సహకారాలు అందించి తన దాతృత్వాన్ని చాటుకోవడం వల్ల పోలి నరసయ్య ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన కోడలు పోలి నరసమ్మ గతంలో మండలాధ్యక్షురాలిగా పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేశారు. ఆ సమయంలో పోలి నరసయ్య తన కోడలికి సూచనలు, సలహాలు ఇచ్చి మండలాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించారు. మృతునికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాయచోటి అర్బన్: గర్భిణులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యురాలు శారద



నందలూరు: గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న రాయల్ సేవా సమితి సభ్యులు

రాయచోటి అర్బన్ : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతారని రాయచోటి రూరల్ మండలం యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు శారద అన్నారు. బుధవారం యండపల్లె పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఎ కార్యక్రమం జరిగింది. డాక్టర్ శారద ఆధ్వర్యంలో దాదాపు 28 మంది గర్భిణులకు ప్రధానమంత్రి మాతృవందన అభియాన్ కార్యక్రమం కింద చికిత్సలు నిర్వహించారు. హిమోగ్లోబిన్, బరువు తదితర పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, మాంసకృతులతో కూడిన అదనపు ఆహారాన్ని తీసుకోవాలంటూ సూచించారు. ఐసీడీఎస్ అధికారులు అందించే సేవలను పొందడంతోపాటు వారు అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లలిత కుమారి, వెంకటేశ్వరరెడ్డి ఫార్మసిస్టు గంగాధర్, సూపర్‌వైజర్ గణేష్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉషారాణి, శిరీష, చాను, అజ్మత్, రాజేంద్ర, లక్ష్మినారాయణ, రజిత పాల్గొన్నారు.

40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు : ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్‌లు తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ గర్భిణులకు స్కానింగ్ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు బీపీ, రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అనంతరం రాయల్ సేవా సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటనారాయణ, సూపర్‌వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్షపాత వైఖరిని విడనాడాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎంయూ కార్మికులు

రాయచోటి అర్బన్ : డీఎం ధనుంజయ్ అనుసరిస్తున్న యూనియన్ పక్షపాత ధోరణిని విడనాడాలని రాయచోటి డిపో ఎస్ఎంయూ కార్యదర్శి యహియా బాషా డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు డ్రైవర్లు, కండక్టర్ల సీనియారిటీ జాబితాను రూపొందించడం లేదని ఆరోపిస్తూ బుధవారం ఎస్ఎంయూ కార్మికులు బుధవారం ఆర్టీసీ డిపోగేటు వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర డిపోల నుండి రిలీవింగ్‌పై వచ్చిన 5 మంది డ్రైవర్, కండక్టర్‌లను నిబంధనలకు విరుద్ధంగా సీనియారిటీ జాబితాలో చేర్చడం దారుణమని మండిపడ్డారు. జాబితాను వ్యతిరేకించినప్పటికీ అధికారులు తమ వ్యతిరేకతను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడాన్ని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు సీనియారిటీ లిస్టులను ప్రకటించిన తర్వాతనే జాబితాను తయారు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

సరస్వతీ.. నమోస్తుతే

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాజంపేటతోపాటు పలు మండలాల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బిందె సేవ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలానే వివిధ ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీలు తీర్థప్రసాదాలు అందజేశారు. – సాక్షి, నెట్‌వర్క్



రైల్వేకోడూరు అర్బన్: బిందెసేవ నిర్వహిస్తున్న యువకులు



రాజంపేట టౌన్: వైభవంగా సాగుతున్న బిందెసేవ మహోత్సవం



ఒంటిమిట్ట: బిందె సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య యువకులు



పుల్లంపేట: సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న మారెమ్మ



రామాపురం: సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరీ



చిన్నమండెం: అలంకరణలో వాసవీ మాత



నందలూరు: బిందెసేవ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు



రాయచోటి టౌన్: సరస్వతీ దేవిగా భద్రకాళి



రైల్వేకోడూరు అర్బన్: ఆకట్టుకున్న సరస్వతీ అలంకరణ



సిద్దవటం: సరస్వతీ దేవి అలంకరణలో విజయదుర్గ



రాయచోటి టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో..



చిట్వేలి: సరస్వతీదేవి అలంకారంలో భద్రకాళి



రాజంపేట టౌన్: సరస్వతీ దేవిగా వాసవీమాత



రాజంపేట టౌన్: కాళరాత్రి అలంకారంలో మారెమ్మ



లక్కిరెడ్డిపల్లె: శ్రీ దుర్గా దేవిగా సర్వమంగళాదేవి



రాయచోటి టౌన్: సరస్వతీ దేవిగా చౌడేశ్వరీ దేవి



సుండుపల్లె: అలంకరణలో దర్శనమిస్తున్న వాసవాంబ